# దారి దీపం

బండారి రాజకుమార్

కండ్లతోటే నీ రెండు కాళ్లనూ ముద్దుపెట్టుకుంట.

★

మోకుతో జబ్బలు, గుజిబంధంతో కాళ్లు కాయలుగాశిన కాయం గదా నాయినా!
రోజంతా కష్టంజేశి పెయ్యంతా నొప్పులతో ఏ రాతిరో ఇల్లుజేరేటాల్లకు నీ వొంటిమీద
కాపిశ్కెడు వుడుకుడుకు నీళ్ళన్నా కాలేకపోతాన.
తానంజేశి మనిషివి తేలికపడుతవని కలగనలేను.

పిడికెడు పిడికెడు నొప్పులగోళీలు బొండిగె జారుతున్న దృశ్యం ముద్ద నోట్లెపెట్టుకున్నప్పుడల్లా
తల్సుకుని తండ్లాడుతనే వుంట.
సర్కారు కొలువుజేశే కొడుకున్నా నీ కష్టం రంధి తీర్తలేదేందే బాపూ అని వొంటరితనాల్లో
కుమిలిపోతనే వుంట.

తాడెక్కి దిగుడంటే సచ్చిపుట్టుడే గదనే.. మాబతుక్కి దారిదీపమై నిత్తెం నువ్వు గాలిదీపమై
ఊగుతాంటే బుగులైతాందే నాయిన.
ఏమైతదనే జిద్దుకు పోతవుగని వద్దంటే వూకోవు గదనే. పారుకం వున్నన్ని దినాలు
బతుకుంటది బిడ్డా అంటవు.

★

నీకిప్పుడు మండువకాడి ముచ్చట్లే వుప్పోస.
వాడికదార్లే నీ సాయితగాళ్ళు. అమ్మొక్కత్తే గల్మల్ల గూసోని ఎదురుసూశే తోడుగువ్వ!

★★★



# చెదిరిన బంధం-చెరగని సంతకం

తేజశ్విని రవి

విరిగిన నీ మాటలకు
పగిలిన నా మనస్సు
అనన్య వేదన.

నీ ఊసుల తీరంలో
నలిగిన నా మనసు
ఇంకా అక్కడే, సేదతీరాలని.

చీలిన మన చనువులో
చెలిమిని వెత్తుక్కుంటూ
ఇంకా అక్కడే, నిలిచిపోయింది.

విరిగినా, ఆ ముక్కలనుంచే
యే కన్నీటి చుక్కతోనో
ఇంకా అక్కడనే విరియాలని
ఉండిపోయింది.

ఆశకు తెలియదుగా మరి
చెదిరిన నీ తలపులు కలిసినట్టుగా
తెగిన మన బంధాలు ముడిపడవని
ప్రేమను ఎరుగదుగా అదీ!

జారిన నీ మాటలను
నా పమిటలో పొదుముకోగలను నేను
రాలిన నా ఎడద తునకలను
మాలగా కూర్చి పెట్టగలవా నువ్వు..!?

★★★

## చంపకండి

### డా.భీంపల్లి శ్రీకాంత్

చెంపలపై జారే కన్నీటివరదను ఆపకండి
అవి బాధలను ఓదార్చే దుఃఖసముద్రాలు

మదిలో కొలువైన తీపిజ్ఞాపకాలను చెరపకండి
అవి గతస్మృతులను గుర్తుచేసే మధురసంతకాలు

అవినీతిపై పోరాడే అక్షరాయుధాలను చంపకండి
అవి అన్యాయాన్ని ధిక్కరించే కవితాగాండీవాలు

పూలపై తారాడే జంటితేనీగలను ముట్టకండి
అవి మధువును పంచే మధురామృతకలశాలు

మట్టిని ముద్దాడే వానచినుకులను పట్టకండి
అవి కోట్ల గొంతుకలను తడిపే జీవధాతువులు

పసిహృదయాల్లో మొలకెత్తే ఆలోచనలను తుంచకండి
అవి నవశకానికి నాందీవాచకమయ్యే సృజనదీపికలు

గాయపడిన మనిషి గుండెల్లో గాయాలను తడమకండి
అవి బాధల ఆటుపోట్లను మోస్తున్న దుఃఖ జీవితాలు

సతతం మనుషులను అలరించే పక్షులను చంపకండి
అవి హృదయాలను దోచే అందమైన ప్రకృతికాంతలు

మూఢాచారాలపై ఎక్కుపెట్టే అక్షరాస్త్రాలను ఆపకండి
అవి నవసమాజాన్ని మేల్కొలిపే చైతన్యదివిటీలు

నవనీత మొగ్గలపై వాలే నవకవనాలను చిదమకండి
అవి తెలుగు సాహితీవనంలో విరబూసే పసిబుగ్గలు

★★★

## మట్టి తుట్టె

### గాదిరాజు మధుసూదనరాజు

ఇది ఈ లోకపు బతుకుబుట్ట
ఇది భూగోళపు మట్టి తుట్టె
గట్టుల్లేని గుట్టుతెలీని పెద్దబుట్ట
కష్టసుఖాల ఘటనల గుట్ట
నవరసాల భావాల చిట్టా
అనుభవ చరితల జ్ఞాపకాలకట్ట

పుట్టగానే
పట్టుకుంటుంది
పొట్టనదాచిపెట్టుకుంటుంది
బాధ్యతగాప్రేమగా
గట్టిగ పొదివిపట్టుకుంటోంది
పద్ధతిగా శ్రద్ధగా

ఈ బుట్ట ఎవరిదో ? తెలీదు
ఎవరు తయారీ యో? తెలీదు
యజమాని ఎవరో ? తెలీదు

అయినా బాగుంది

లోకమ్మొత్తం ఇందులో వుంది
యుగయుగాలుగ కనబడ్తోంది

★★★



## సాలీడు గూడు
### వెంకట్ దశిక

ఎప్పుడు మొదలయ్యిందో
ఎక్కడికో తెలియని ఈ పరుగు
ఒక సారి ఆపి వెనుకకు చూస్తే
ఎంత దూరం వచ్చేసానో!!..నాతో నేను విడిపోతూ
నాచుట్టూ ఎన్ని చిక్కు ముళ్ళో!!

దూరంగా ఎక్కడో..
బిక్కు బిక్కు మంటూ జ్ఞాపకాల దీపాలు

వెనక్కి పోదామని చూసానో
నన్ను పట్టుకు లాగుతూ
నాతోనే నాలోనే ఉన్న ఎందరో 'నేను ' లు
అక్కడే ఉంటే ఎంత భాగుండేదో!
నాతో నేను ఒక్కడినే ఉన్న రోజులవి

కానీ..
గమ్యం గమనం లేని జీవనం ఉంటుందా?
ఆశల పల్లకిలో సాగే పయనం ఆగుతుందా?
ఏమో ఎవరికి తెలుసు?
నిన్నటి నవ్వులు రేపు మళ్లీ వస్తాయేమో?

మళ్లీ పరుగు మొదలు
నిన్నటి మెరుపులు వెతుక్కుంటూ రేపటి వైపు

★★★



## చిరు కవితలు
### గుల్జార్

ఎక్కువేం మారలేదు
వయసుతో పాటు
చిన్నప్పటి పట్టుదల
యిప్పుడు సర్దుబాటు

★★★★★★★

ఓ జీవితమా !
నీవెంత అందమైన దానవైనా కానీ
నవ్వుతున్న స్నేహితులు
లేకుంటే నువ్వేమాత్రం బాగుంటావని

★★★★★★★★

నేను రాసిన మాటలు
ప్రతీ ఒక్కరూ అర్థం చేసుకోలేరు
నేను అనుభవించి రాస్తే
కేవలం వారు పదాలు వెతుకుతారు

★★★★★★★★★★★

పదాలకు సయితం
వుంటాయి వాసనలు
వడ్డించే ముందుగా
చూడాలి వాటి రుచులు

★★★★★★★★★★★

ప్రతీ కష్టాన్నీ నాదనుకునే
చేసుకుంటూ ఆలింగనం
ఎందుకంటే చివరగా
నాదే కదా ఈ జీవితం.

★★★

అనువాదం- ఆర్.ఎస్. వెంకటేశ్వరన్



# బా...గోదు

డా.మక్కెన శ్రీను

అతనిప్పుడు
విసవిసలు
రుసరుసలు
దేహఅచ్ఛాదనగా
తిరిగేస్తున్నాడు !
సహనం సంస్కారం
ధరించడానికి
బొత్తిగా శరీరం
సహకరించడంలా !
వలువలు విలువలు
ధిక్కారస్వరాన్ని
ఆలపిస్తూ అచ్చంగా
నగ్నత్వంకోరుతున్నాయ్!
అమానవీయతఅసమానత
ముసుగుదాల్చి
బట్ట కరువైన వాసన
చిత్రంగా గుబాళిస్తుంది !
అజమాయిషీ అదుపురహిత
ధోరణల ధారణతో
సరికొత్త రూపుతో
వేషం కుదిరింది !
అనాలోచన అస్థిరత్వం
కంకాళ నృత్యం గ
స్వేచ్ఛ సుఖం
వెచ్చగా ఆవిరవుతుంది !
అశాంతి ,అలజడుల
రాజ్యభోజ్యంతో
తులతూగుతూ
మత్తుగా నిదరోతున్నాడు !
హిత భాషణలు
ప్రవచనాలు
ఊదర కొడుతూ
సద్దు చెయ్యకండి
గతం గుర్తొస్తే ..! ★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎవరు విందురు నా పాటనీ దినమ్ము
తిరుగుచుంటిని యొంటరి దేశమందు
ఏ యెడారినో యొక్కడినేగునపుడు
నోరు విప్పని యిసుకరేణువులు వినును

చెట్టుచేమలు విను తమ చెవులనొగ్గి
చేరనేరని పక్షులు చెంత చేరు
తమ నిరంతరగానంపు తన్మయమున
కరగు జలపాతములు గొంతు కలుపనగును

పలుకలేనట్టి వేవేల బండరాళ్ళు
కడుపులో దాచుకొన్నట్టి కథలనన్ని
కాంచగల్గును నాదు సంగతుల యందు
గతులెరుంగని నిశ్చల గమనమందు

కదలి నిశ్చలమ్ముగ సాగు నదము నేడు
వెడలిపోవగజాలదు విడచి నన్ను
ప్రాణమై ప్రవహించు నా పాటయందు
నా తనువులోన నా నవనాడులందు

చిత్రముగ నేడు ప్రకృతికి చేరువైతి
ఎచటికేగెను నా చిత్తమిన్ని నాళ్ళు
ఎడద కనులార చూసెను పుడమినిపుడు
ఎగసెనానందమందు పంచేంద్రియములు

COMMENTS